# ఆర్చి ఇల్లు

రైలు దిగగానే తెలిసినవాళ్ళు కన్పిస్తారేమోనని అటూఇటూ చూశాడు కీర్తితేజ.

ఇద్దరు ముగ్గురు తప్పితే ఫ్లాట్‌ఫారం మీద ఎవ్వరూ లేరు.

పదేళ్ళయినా రైల్వేస్టేషన్‌లో ఏం మార్పు లేదనుకున్నాడు కీర్తితేజ. స్టేషను మాస్టర్ మాత్రం కొత్తగా కన్పించేడు.

స్టేషన్‌మాస్టర్‌కు టిక్కెట్ యిచ్చేసి స్టేషన్ నుంచి బయటకు వొస్తుంటే ఎర్ర సుబ్బయ్య తాత కన్పించేడు.

ఊళ్ళో అందరికంటే ఎర్రగా, పట్టుకుంటే మాసిపోయేటట్లు కన్పిస్తాడాయన. ఆయన పక్కింటాయన పేరు కూడా సుబ్బయ్యే ఆయన్ని నల్ల సుబ్బయ్యని అంటూ వుండేవాళ్ళు.

"సుబ్బయ్యతాతా ! బాగున్నావా?" ముసలాయన్ని పలుకరించేడు కీర్తితేజ.

బ్రీఫ్‌కేసు పట్టుకుని నిలబడ్డ కీర్తితేజను పరకాయించి చూశాడు.

"ఓరీ నువ్వట్రా! మునసబుగారి అబ్బాయివి కదూ... గుర్తుపట్టలేదురా ముందు నిన్ను చూడగానే" అంటూ కీర్తితేజ చేతులు పట్టుకుని నిమిరేడు.

స్వచ్ఛమైన అప్యాయతలకు పల్లెటూళ్ళు పట్టుగొమ్మలేననుకున్నాడతను.

"మా రెండో అమ్మాయికి కొడుకు పుడితే చూసి వొస్తున్నానబ్బాయ్... నువ్వు హైదరాబాద్ నుంచే గదా రావడం" అడిగేడు సుబ్బయ్య చుట్ట వెలిగిస్తూ.

"రిక్షా ఎక్కుదాం రండి" రిక్షాను పిలవబోయేడు కీర్తితేజ.

"ఆ గతుకుల రోడ్డుమీద రిక్షా ఎక్కితే వొళ్ళంతా పచ్చిపుండు అయినట్లుగా వుంటుంది... చేతిలో బరువు సామాను వుంటే తప్పదనుకో! అడ్డదోవన నడిచివెళతాగాని నువ్వు రిక్షా ఎక్కివెళ్ళు."

రిక్షా ఎక్కాలనిపించలేదతనికి. రెండు రోజులలో వూళ్ళో వ్యవహారాలు పూర్తిచేసుకోవాలనుకున్నాడు. దానికి సుబ్బయ్యగారి సహకారం కావాలి...

"మీతోపాటే నడిచివొస్తాను" అన్నాడు కీర్తితేజ.

"అమెరికా వెళ్ళివొచ్చినవాడివి డొంకరోడ్ల మీద ఏం నడుస్తావబ్బాయ్? రిక్షా ఎక్కి దర్జాగా వెళ్ళక" మళ్ళీ అన్నాడు సుబ్బయ్య.

రిక్షా ఎక్కకుండా సుబ్బయ్యతోపాటే డొంకదోవ పట్టాడు. రోడ్డుమీద అయితే నాలుగు మైళ్ళు వుంటుందిగాని, దొంకదార్లో నడిచివెళ్ళితే రెండు మైళ్ళకు మించివుండదు వూరు.

చుట్టూ దట్టంగా చెట్లు... పక్షుల కిలకిలారావాలు... శరీరాన్ని మృదువుగా స్పృశించే చల్లటి గాలి... పొలం పనులకు వెళ్ళే కూలీలు... డొంకదారిలో కర, కర శబ్దం చేసుకుంటూ వెళ్ళే ఎడ్లబళ్ళు.. డొంకదిగువలో పచ్చడిపొలాలు...

ఆ వాతావరణం చూడగానే ప్రాణం లేచివొచ్చింది కీర్తితేజకు.

"మీ నాన్న చనిపోయినప్పుడు నువ్వు అమెరికాలో వున్నావటగా! ఆఖరి చూపులు కూడా దక్కలేదు... మీ నాన్న గూర్చి పూర్తిగా తెలీదు గాని గొప్ప మనిషి... నలుగురికి పెట్టినవాడే గాని ఎవరిముందు నిలబడి చేయి చాచి ఎరగడు... ఆయన చనిపోయినరోజు వూళ్ళో అందరూ కంటతడి పెట్టుకున్నారు" అంటూ భుజంమీద ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకున్నాడు సుబ్బయ్యగారు.

తండ్రి గూర్చి మాట్లాడుతున్నప్పుడు ఆయన కంఠం రుద్ధమవడం కళ్ళు చెమర్చడం కీర్తితేజ గమనించి కదలిపోయేడు. తండ్రి రూపం కళ్ళలో మెదిలింది... నాన్న ఆరడుగుల ఆజానుబాహువు... దబ్బపండు ఛాయలో పట్టుకుంటే మాసిపోయేటట్లు వుండేవాడు. తెల్లటి ధోవతి, మడత నలగని తెల్లటి సిల్క్‌చొక్కా, భుజంపైన జరీ అంచు ఉత్తరీయం – అత్తరువాసన, లంకపుగాకు చుట్టవాసన ఆయన్ని ఎప్పుడూ వొదిలి వుండేవికావు. చనిపోయేరోజుకూడా చుట్ట పాయలు తీస్తూ ఊళ్ళోవాళ్ళతో మాట్లాడుతూనే పక్కకి వొరిగిపోయాడట...

"మునసబు వెంకయ్యగారంటే ఈ చుట్టుపక్కల వూళ్ళో జనానికి ఎంత గౌరవం!" సుబ్బయ్యగారు చెప్పుకుపోతూనే వున్నారు.

"ఆవిడ వుందా ఇంట్లోనే?" హఠాత్తుగా సుబ్బయ్యగారి మాటలకు అడ్డొస్తూ అడిగేడు కీర్తితేజ.

"వనజమ్మగారా! ఆమె ఎక్కడకు పోతుంది? నోట్లో నాలుకలేని మనిషి... ఆవిడమూలంగా మీ నాన్న మీద మీరు అనవసరంగా ద్వేషం పెంచుకుని నువ్వు, మీ అక్కయ్య తాతగారింటికి వెళ్ళిపోయారుగాని వనజమ్మ సాత్వికురాలేనబ్బాయ్!" అనేశాడు సుబ్బయ్య మొహమాటం లేకుండా.

"ఆర్చీయిల్లు, పొలం అమ్మేద్దామనుకుంటున్నాను తాతా!"

"ఆర్చీయిల్లు అమ్ముతావా?" ఆశ్చర్యంగా కీర్తి తేజ వైపు చూశాడు సుబ్బయ్య.

"తక్కువ ధరకైనా అమ్మేయాలనుకుంటున్నాను"

కీర్తితేజ మాటలు విన్పించుకోనట్లు మరోదిక్కుకు చూశాడు సుబ్బయ్యతాత. ఊళ్ళోకి వచ్చేంత వరకు మళ్ళీ నోరు విప్పలేదాయన.

ఊరికి మధ్యలో ఎత్తైన మట్టిదిబ్బమీద కట్టినమండువా లోగిలి ఇల్లు, ఇంటి చుట్టూ పెద్ద ప్రహారీగోడా, కోటద్వారంలా కనిపించే పెద్ద ఆర్చీ, ఆర్చీగోడకు ఆనుకుని అటూ, ఇటూ అరుగులు. అర్చీయిల్లంటే వూళ్ళో అందరికీ తెలుసు.

"రెండు మూడ్రోజులు వుంటావుగా?" ఆర్చీ యింటి ముందుకురాగానే నోరువిప్పాడు సుబ్బయ్యతాత.

తలూపాడు కీర్తితేజ.

"రెండు మూడ్రోజులయినా ఫరవాలేదుగాని... ఇల్లు, పొలం వ్యవహారం తేల్చుకుని మళ్ళీ ఈ వూళ్ళో కాలుపెట్టే అవసరం కలుగకుండా చూసుకోవాలి" అనుకున్నాడతను మనస్సులో.

ఆర్చీవైపు తేరిపార చూశాడు.

దాదాపు ఇరవై అడుగులు ఎత్తు వుంటుంది ఆర్చీ. సున్నంతో కట్టినా, రెండుమూడు పెద్ద గాలివానలు వచ్చినా చెక్కుచెదరకుండానే వుంది. ఆ ఆర్చీకి ముందు రెండు వైపులా పెద్ద అరుగులు, ఆర్చీపైన కాళింది సర్పంపైన చిందులువేస్తున్న గోపాల కృష్ణుడి బొమ్మ...పడగవిప్పి గోపాలుడికి ఆచ్ఛాదన యిస్తున్న కాళిందీ సర్పం... గోపాలుడికి ఇరువైపుల మోరలెత్తి గోపాలుడి వేణుగానం వింటున్న ఆవులతో ఆ ఆర్చీ ఆకర్షణీయంగా వుంటుంది. రాధామనోహరం ఆర్చీపైకి ప్రాకి దట్టంగా అల్లుకుపోయింది.

... ఆ ఆర్చీ అంటే నాన్నకి ప్రాణం... సంక్రాంతి వచ్చిందంటే చాలు ఆర్చీకి సున్నం కొట్టించి ఆర్చీపైన బొమ్మలకి రంగు వేయించేవాడు...

" ఈ ఆర్చికి పెట్టిన పెట్టుబడితో ఓ పెద్దయిల్లు కట్టించినట్లయితే నలుగురికి ఉపయోగపడి వుండేది కదా!" అనుకున్నాడు మనస్సులో.

పాతగేటు తోసుకొని లోపలికి అడుగుపెట్టాడు. ఇంటి ముందువున్న రకరకాల పూలమొక్కలు తలలు వూపుతూ వచ్చినవాళ్ళకు స్వాగతం చెబుతున్నట్లుగా వున్నాయి.

మండువాలో ఫ్రేమ్ కుర్చీ పాతది వేసివుంది.

నాన్న ఎప్పుడూ ఆకుర్చీలోనే ఈ ప్రదేశంలోనే కూర్చుని చుట్టలు చుట్టుకుంటూ వుండేవాడు.

తూర్పువైపు గదిలోకి అడుగు పెట్టగానే ఆశ్చర్య మేసింది. గదంతా శుభ్రంగా తుడిచివుంది. చెక్క బీరువాలో తన పాతపుస్తకాలు అదే స్థానంలో వున్నాయి. టేబుల్ మీద తన ఫోటోకూడా వుంది.

ఆ గదిలోంచి బయటకు వచ్చి పడమటవైపు ఉన్న నాన్నగదిలోకి అడుగుపెట్టాడు. పందిరి మంచం యథాస్థానంలోనేవుంది. పందిరి మంచం తలవైపు చట్రంలో బిగించిన కాంచనమాల బొమ్మ రంగు వెలిసిపోయినా స్పష్టంగానే కనిపిస్తోంది.

గోడకి అమర్చిన తండ్రిఫోటో కనిపించగానే కీర్తితేజ గుండె చిక్కబట్టింది.

తండ్రి గుర్తుకురాగానే కళ్లు చెమర్చేయి.

... నాన్న తనని ఎంతగా ప్రేమించేవాడు! చిన్నప్పుడు తనను కాలు కింద పెట్టనిచ్చేవాడు కాదు... ఎప్పుడూ ఎత్తుకుని తిప్పేవాడు.. తనకు వొంట్లో నలతగా వుంటే మనిషి తల్లక్రిందలైపోయేవాడు... ఆ ప్రేమ, అనురాగం ఏమయిపోయాయి? డిగ్రీలో చేరడానికి హైదరాబాద్‌లో పెదనాన్నగారింటికి వొచ్చేడు... తను హైదరాబాద్ వొచ్చాక నాన్న ఎవరినో ముక్కు మొహం తెలియని ముప్పయ్యేళ్ళ వయస్సువున్నామెను వుంచుకున్నట్లు తెలియడంతో నాన్నంటే విరక్తి కల్గింది... ఉత్తరాలు రాయడం మానేశాడు... వూరికి వెళ్ళడం కూడా మానేశాడు.. తన సంగతులు పెదనాన్నే నాన్నకు తెలియజేస్తూవుండేవాడు.

నాన్న చనిపోయేక మళ్ళీ స్వగ్రామం రావడం యిదే...

పదేళ్ళ కుర్రాడు గదిలోకి వొచ్చి తొంగిచూసి వెళ్ళాడు.

కీర్తితేజకు ఆ కుర్రాడిని అంతకుమునుపు ఎప్పుడో చూసినట్లనిపించింది.

నలభైయ్యేళ్ళ వయస్సు వున్నామెను వెంటబెట్టుకుని వొచ్చాడు ఆ కుర్రాడు.

"నువ్వాబాబు! ఇప్పుడేనా రావడం" అందామె. జీరపోయిన గొంతుకతో.

"వనజమ్మగారంటే మీరేనా?" మళ్ళీ ఆమె వైపు తేరిపార చూడకుండా కొంచెం కటువుగా అడిగాడు.

"అవును బాబు!" అందామె తలవంచుకుని.

"ఇల్లు, పొలం అమ్మేసి వెళ్ళిపోదామనుకుంటున్నాను. రెండు మూడు రోజుల్లో మీదారి మీరు చూసుకోండి.. మీ ఖర్చులకు కొంత డబ్బు ఏర్పాటు చేస్తాను" అన్నాడు కీర్తితేజ.

ఆమె మొహంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

"నీ యిల్లు... నీ యిష్టం బాబు! రెండు రోజుల్లో వెళ్ళిపోతాను... ముందు స్నానం చెయ్యి" మరోక్షణంలోనే తేరుకుని అందామె.

పెరట్లో బావి దగ్గర సబ్బు, టవల్ వుంచింది మనజమ్మ.

ఆరుబయట వొంటి మీద ఎండపడుతుంటే బావిలో చల్లటి నీళ్ళు తోడుకుని వొంటిమీద పోసుకుటుంటే ఎంతో హాయనిపించింది.

స్నానం చేసి వొళ్ళు తుడుచుకుంటూ దొడ్డి అంతా పరిశీలనగా చూశాడు. అరటిచెట్లు, కొబ్బరిచెట్లతో పచ్చ, పచ్చగా కనిపించింది.

ఇంటి వెనుకవున్న పశువుల చావిడినుంచి లేగదూడ పరుగెత్తుకుంటూ వచ్చింది. కీర్తితేజ వైపు ఆశగాచూస్తూ ఒకప్రక్క నిలబడ్డ వనజమ్మ కొడుకుచుట్టూ తిరుగుతూ గంతులు వేయడం మొదలు పెట్టింది లేగదూడ.

"నీ పేరేమిటి?" ఆ కుర్రాడిని అడిగాడు.

"బలరాముడు" అన్నాడాకుర్రాడు సిగ్గుపడుతూ.

... కాన్సర్ వచ్చి చనిపోయిన చిన్నాన్నపేరు బలరామయ్య.... ఆ పేరు పెట్టాడన్నమాట వీడికి నాన్న...

బలరాముడి ముఖంలో తండ్రిపోలికలు స్పష్టంగా కనిపించాయి కీర్తి తేజకి.

గదిలోకి వొచ్చి బట్టలు వేసుకుని సుబ్బయ్య తాత యింటివైపు వెల్దామనుకున్నాడు.

వనజమ్మ తను పొలం, ఇల్లు అమ్ముతానంటే ఏమి అనకపోవడం, రెండు మూడు రోజుల్లో ఇల్లు ఖాళీచేసి వెళిపొమ్మంటే వెళ్ళిపోడానికి సిద్ధపడటంతో అతనికి మనస్సు తేలికపడినట్లు అనిపించింది. తనని, తన తండ్రిని పన్నెండేళ్ళపాటు విడదీసినందుకు వనజమ్మకు ఆ మాత్రం శాస్తి జరగాల్సిందేననుకున్నాడు.

బలరాముడు గదిలోకివొచ్చి ఇనప్పెట్టె తాళాలు తెచ్చియిచ్చాడు.

తండ్రి గదిలోకి వెళ్ళి ఇనప్పెట్టె తాళం తీసి చూస్తే పై అరలో నోట్ల కట్టలు కన్పించాయి. పాతికవేలు దాకా రొక్కంవుంది. లోపలి అరలో అమ్మ నగలన్నీ భద్రంగానే వున్నాయి. దస్తావేజులు తీసి చూశాడు కీర్తితేజ.

వనజమ్మకు ఒక్క సెంటు పొలంకూడ రాయలేదు వెంకయ్యగారు. అతనికి మొట్టమొదటిసారిగా వనజమ్మగారి మీద గౌరవభావం కల్గింది.

"అమ్మ అన్నం వడ్డించింది" బలరాముడు వచ్చి చెప్పాడు.

అయిష్టంగానే భోజనం చేయడానికి కూర్చున్నాడు. వనజమ్మ చేతివంట తినవలసి వచ్చిదేననుకున్నాడు.. రెండు రోజులు తప్పదు... ఆపైన వాళ్ళెవరో తనెవరో!...

బీరకాల పాలకూర, ములక్కాడలు వేసిన పప్పుచారు రుచిచూడగానే ప్రాణం లేచి వచ్చిందతనికి. కూర, పప్పుచారు రెండు సార్లు వడ్డించింది వనజమ్మ.

ఆ క్షణంలో తల్లి గుర్తుకు వచ్చింది. తనకిష్టమని బీరకాయ పాలకూర, పప్పుచారు ఎక్కువగా వండేది.

...బావి దగ్గర స్నానం, బీరకాయ పాలకూర, ములక్కాడలు వేసిన పప్పుచారు తనకు యిష్టమని నాన్నే ఈ వనజమ్మకు చెప్పి వుంటాడు...

ఇంట్లోంచి వెళ్ళిపొమ్మన్నా తనకిష్టమైనవి ఎందుకు చేసిపెడుతున్నదీమె... నాన్న చనిపోయేక డబ్బు, నగలు తీసుకు వెళ్ళిపోయినట్లయితే తన మనస్సు సంతోష పడివుండేదేమో! ఆస్తి కోసం కక్కుర్తిపడి నాన్నను బుట్టలో వేసుకుందని తన మనస్సులోని భావాలు పటాపంచలైపోతుంటే తల్లడిల్లిపోయాడు తను.

భోజనం చేశాక సుబ్బయ్యతాత యించికివెళ్లేడు.

ఆ మాట ఈమాట మాట్లాడుకున్నాక ఆర్చీఇల్లు, పొలం అమ్మకం విషయం వచ్చింది.

"నీ ఆస్తి నువ్వు అమ్ముకోవడానికి నాకేం అభ్యంతరం లేదుగాని, ఆ వనజమ్మగారికి

ఏదోక ఆదరవుచూపి వెళ్ళరాబ్బాయ్ ! కట్టుబట్టలతో ఈ వూరువచ్చింది. తన మంచితనంతో మీనాన్నకు దగ్గరయ్యింది.. కానీ మీనాన్న ఆస్తి మీద ఆమెకు దృష్టిలేదు.. మీ నాన్న చనిపోయిన రోజు కూడా ఇనప్పెట్లెలో డబ్బుతీసి చినకర్మకి, పెద్దకర్మ ఖర్చులకి డబ్బు వాడమని సలహాయిస్తే ససేమిరా వొప్పుకోలేదు... నువ్వు వచ్చేదాక ఇనప్పెట్టె తెరిచే ప్రసక్తి లేదని చెప్పేసింది.... నాదగ్గర డబ్బు వాడి నువ్వువొచ్చాక డబ్బు యిప్పిస్తానంది" అన్నాడు సుబ్బయ్యతాత.

సుబ్బయ్యతాతతో కలిసి గ్రామమంతా కలియతిరిగాడు.

ఆర్చీఇల్లు అమ్మకం ప్రస్తావన వూళ్ళో ఎవ్వరికి నచ్చినట్లు లేదు.

అందరూ మౌనంగా వుండిపోయారు. ఈ విషయం చర్చకు వొచ్చినప్పుడు. రాత్రి భోజనం అయ్యాక తనగదిలోకి వచ్చి పడుకున్నాడు.

ఓ రాత్రి వేళ ఎవరో వెక్కివెక్కి ఏడుస్తున్నట్లు అనిపించడంతో మెలుకువ వచ్చి గదిలోనుంచి బయటకొచ్చాడు కీర్తితేజ.

వనజమ్మ అతను రావడం చూసి ఏడ్పు దిగమింగి కళ్ళుతుడుచుకుంది.

"మీకేం కష్టం రాదులెండి.. మీకెంత డబ్బుకావాలంటే అంత తీసుకోండి" అనేశాడు కీర్తితేజ.

"అదికాదు బాబు.. మీ నాన్నగారికి ఈ ఆర్చిఇల్లు అంటే పంచప్రాణం... ఈ ఇల్లు మాత్రం అమ్మకు బాబు! చనిపోయే ముందు కూడా మీ నాన్నగారు ఈ మాట నీకు చెప్పమన్నారు. నాయనా! మీ నాన్నగారి చివరికోరిక తీర్చలేకపోతున్నాననే బాధ నన్ను పీడిస్తున్నది బాబు!" అందామె రుద్ధమైన కంఠంతో.

ఆమె మాటలకు కదిలిపోయాడు.

ఆమె నాన్న మనస్సును అర్ధంచేసుకున్నట్లుగా తను అర్ధంచేసుకోలేదేమో! అమెను కష్టపెడితే నాన్న ఆత్మను కష్టపెట్టినట్లే!

"ఇల్లు, పొలం అమ్మడం లేదమ్మా! నువ్వేం బాధపడకు... .పొలం, ఇల్లు తమ్ముడి పేర రాయస్తాను... ఈ ఆర్చీఇల్లు మంచికి, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుందమ్మా!" అన్నాడు కీర్తితేజ ఉద్వేగంతో.

అల్లకల్లోలంగా వున్న వనజమ్మ మనస్సు స్థిమిత పడింది.

కీర్తితేజ తమ్ముడి పక్కన చోటుచేసుకుని పడుకున్నాడు ఆ రాత్రి. *

**(ఈనాడు ఆదివారం - 19-5-1991)**